

గిరిజన ఉత్పత్తులు..

ఏకలవ్య పాఠశాలలో బిర్సా ముండా జయంతి ఘనంగా జరిగింది. కలెక్టర్ పాల్గొన్నారు.

- 10లో



ఉత్సాహంగా క్రీడా పోటీలు

ఎచ్చెర్లలో క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆటగాళ్లు హోరాహోరీగా పోరాడుతున్నారు.

- 10లో

ఇండస్ట్రియల్ పార్క్ స్థలం పరిశీలన

మెళియాపుట్టి: మెళియాపుట్టిలో సర్వే నంబర్ 486లో 70 ఎకరాలను ఇండస్ట్రియల్ పార్క్‌కు గతంలో కేటాయించారు. అయితే ప్రస్తుతం ఆ స్థల పరిస్థితిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆరా తీశారు. శుక్రవారం సంబంధిత స్థలాన్ని ఆయన పరిశీలించారు. స్థలానికి సంబంధించి వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తీసుకున్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ బడే పాపారావు, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఉపకార వేతనాలపై అవగాహన సదస్సు నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కాలేజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల రిజిస్ట్రేషన్‌పై కళాశాలల ప్రిన్సిపాళ్లతో శనివారం సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్న సమావేశానికి ప్రిన్సిపాళ్లు, కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులు హాజరు కావాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహనరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థుల పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌పై ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

స్వాభిమాన్‌కు 14 వినతులు



దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగులు సమర్థతలోనూ, ఆలోచనలోనూ ఎందులోనూ తీసిపోరని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల నుంచి జేసీతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవిత వినతులు స్వీకరించారు. కార్యక్రమానికి 14 వినతులు వచ్చాయి. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు.

సంక్షేమానికే ప్రాధాన్యం



కానిస్టేబుల్ సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : పోలీస్ సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని, వ్యక్తిగత, వృత్తిరీత్యా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఆర్ సిబ్బందికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే నిర్వహించారు. సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


జాతీయ స్థాయి శిక్షణ శిబిరాలకు కోచ్‌గా అర్జున్‌రెడ్డి



ఎమ్మెస్సార్‌తో జి.అర్జున్‌రావురెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఆంధ్రప్రదేశ్ ప్రాబబుల్స్ జట్ల కోచింగ్ క్యాంపు నిర్వహణకు కోచ్‌గా జిల్లాకు చెందిన డీఎస్‌ఏ కోచ్, జిల్లా కార్యదర్శి జి.అర్జున్‌రావు రెడ్డి నియామకమయ్యారు. ఈ శిక్షణ శిబిరాలు చిత్తూరు వేదికగా ఈనెల 27వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందుకై గురువారం రాత్రి ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. అనంతరం కోల్‌కతాలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనే ఆంధ్రా జట్లకు సైతం కోచ్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు బాస్కెట్‌బాల్ సంఘ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, డీఎస్‌డీఓ శ్రీధర్‌రావులు అర్జున్‌రెడ్డిని అభినందించారు. ఉత్తమ శిక్షణను అందించి రాష్ట్ర జట్లను ముందంజలో నిలపాలని వారు ఆకాంక్షించారు.

శ్రీముఖలింగంలో కార్తీక దీపోత్సవం



ఆలయ శిఖరం మీద జ్వాలాతోరణం

జలుమూరు: శ్రీముఖలింగంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రధాన ఆలయంలో భక్తులు దీపాలంకరణ చేశారు. భక్తులు ఆలయం ఆవరణలో ఓం, స్వస్తిక్ ఆకారంలో దీపాలను వెలిగించారు. ఆవరణతోపాటు ఆలయం చుట్టూ దీపాలు అలంకరించి వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. శిఖరం మీద జ్వాలాతోరణం పెట్టారు.



● దీపాల పడవలు..

కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రజలు నదుల్లో దీపాలు విడిచిపెట్టారు. బాహుదా నదిలో వేకువ జాము నుంచే భక్తులు ఇలా తెప్పల్లో దీపాలు వదిలారు. - ఇచ్ఛాపురం



● జ్వాలాతోరణం..

శ్రీకాకుళం బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం నిర్వహించారు. అలాగే కోటి వత్తులను ఒకటిగా చేసి వెలిగించారు. - శ్రీకాకుళం కల్చరల్



● పున్నమి వెలుగులో కార్తీక దీపం..

కార్తీక పూర్ణిమ సందర్భంగా ఆడ పడుచులు కార్తీక దీపాలు వెలిగించారు. జిల్లా కేంద్రంలో నిండు చంద్రుడు సాక్షిగా దీప కాంత ఇలా మెరిసింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

పల్లెకు బానిషా సంకెళ్లు





చంద్రబాబు చెప్పింది ఇది..

ఎట్టి పరిస్థితుల్లో బెల్ట్‌షాపులను అనుమతించ వద్దు. లిక్కర్ షాపుల యజమానులు ఎవరైనా బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తే వారిపై చర్యలు తీసుకోవాలి. బెల్ట్‌షాపులకు మద్యం అమ్మే లిక్కర్ షాపులకు మొదటిసారి తప్పు చేస్తే రూ.5లక్షలు అపరాధ రుసుం విధించాలి. మళ్లీ నిబంధనలు ఉల్లంఘిస్తే వారి లైసెన్సు రద్దు చేయాలి.

జరుగుతున్నది ఇది..

పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. మండలాల్లో నాలుగైదు ప్రాంతాల్లో ఉండాల్సిన మద్యం దుకాణాలు నేడు పల్లెల్లో పుట్టగొడుగుల్లా గల్లీకొకటి వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా షాపులు ఏర్పాటు చేసి ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ. 20నుంచి రూ.50వరకు అధికంగా విక్రయిస్తున్నారు. ఉదయం నుంచి మొద లుకుని రాత్రి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగు తుండటంతో బెల్టు షాపుల్లో మద్యం ఏరులై పారుతోంది.

- జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్ట్ షాపులు
- మత్తులో జోగుతున్న గ్రామాలు
- 2014-19 నాటి పరిస్థితులు పునరావృతం
- ఎంఆర్‌పీకి మించి విక్రయాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పల్లెకు మళ్లీ బా'నిష' సంకెళ్లు పడనున్నాయి. 2014-19 పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఏ రకంగా 'బెల్ట్' దందా నడిచిందో ఇప్పుడదే బాగోతం కొనసాగుతోంది. ఊరూరా బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటిని ప్రోత్సహిస్తుందెవరో జనమందరికీ తెలుసు. దాడులు చేస్తుండటం, బెదిరింపులకు దిగడం, ప్రశ్నిస్తే కేసులు పెట్టడం వంటి ఘటనలతో బయటకు వచ్చి చెప్పలేకపోతున్నారు. నాయకులే అండగా నిలిచి గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు తెరిపిస్తున్నారు. ఒక్కో దుకాణం నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలే కాదు బెల్ట్ దుకాణాలు కూడా తమ గుప్పెట్లో పెట్టుకుని నడుపుతున్నారు. ఎవడొస్తాడో చూద్దాం, ఎవరు అడ్డుకుంటారో చూద్దామని రెచ్చిపోతున్నారు.

రోజురోజుకీ పెరుగుతున్నాయ్..

- ప్రభుత్వం గత నెల 16వ తేదీ నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకొస్తే మద్యం ఆదాయానికి అలవాటు పడిన కొందరు దానికి సమాంతరంగా బెల్ట్‌షాపుల పాత పాలసీని తీసుకొచ్చారు.
- ప్రైవేటు వ్యక్తులు మద్యం అమ్ముకునేందుకు లైసెన్సు ఫీజులు నిర్ణయించినట్టుగానే బెల్ట్ దుకాణాలు ఏర్పాటుకు డిమాండ్‌ను బట్టి ధర నిర్ణయించేశారు.
- కొన్నిచోట్ల గ్రామాల్లో ఏకంగా వేలం పాటలే నిర్వహించడం బెల్ట్ దుకాణాలకు పరాకాష్ట.
- ఇప్పటికే జిల్లాలో 1450కిపైగా బెల్ట్ దుకాణాలు ఏర్పాటైపోయాయి. వీటి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది.
- మరికొన్ని రోజుల్లో ఈ సంఖ్య వేలకు చేరే అవకాశం ఉంది.

ఎనీటైమ్ మందు...

గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకుంటున్న బెల్ట్‌షాపులు సమయ పాలన లేకుండా తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకు మద్యం అందుబాటులో ఉంటుంది.

- గ్రామాల్లో కూలి పనులు చేసుకునే నిరుపేదలు బెల్ట్‌షాపులకు అలవాటు పడి పనులకు సైతం పోకుండా నిత్యం గ్రామాల్లో మద్యం మత్తులో ఉంటున్నారు.
- బెల్ట్‌షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.
- అప్పులు చేసి తాగుతున్న పరిస్థితులు ఉన్నాయి.
- గ్రామాల్లో ఉన్న వేర్వేరు దుకాణాల్లో లోపల మద్యం వ్యాపారం చేస్తున్నారు.
- సొంత ఇళ్లల్లో పెద్ద ఫ్రిజ్‌లు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నారు. దీంతో పచ్చని సంసారాల్లో చిచ్చు రేగుతోంది.



ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపు

నియోజకవర్గం	బెల్ట్ దుకాణాలు	విక్రయిస్తున్న అదనపు ధర
శ్రీకాకుళం	190	రూ. 20 నుంచి రూ.30
ఎచ్చెర్ల	240	రూ. 20 నుంచి రూ.30
ఆమదాలవలస	200	రూ. 20 నుంచి రూ.50
పాతపట్నం	156	రూ. 20 నుంచి రూ.30
నరసన్నపేట	249	రూ. 20 నుంచి రూ.50
టెక్కలి	100	రూ. 20 నుంచి రూ.30
పలాస	133	రూ. 20 నుంచి రూ.50
ఇచ్ఛాపురం	200	రూ. 20 నుంచి రూ.40

వైఎస్ జగన్‌ను కలిసిన కిల్లి



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన సత్యనారాయణ

సరుబుజ్జిలి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సరుబుజ్జిలి మాజీ ఎంపీపీ, మండలపరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమదాలవలస నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలను ఆయనకు గురించి వివరించారు. కిల్లితో పాటు ఆయన కుమారుడు కిల్లి వెంకటేష్ కూడా ఉన్నారు.

హామీలు విస్మరించి ప్రజలపై ధరల భారం



కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా టెక్కలిలో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

టెక్కలి: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలపై ధరల భారం వేస్తోందని సీపీఎం నాయకులు మండిపడ్డారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టెక్కలి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిత్యావసర ధరలను పెంచుతూ ప్రజలపై ఆర్థిక భారం వేస్తున్నారని దుయ్యబట్టారు. వినియోగదారులను నష్టపరిచే విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే రద్దు చేయాలన్నారు. విద్యుత్ ట్రూఅప్ చార్జీలను తక్షణమే తగ్గించాలని, ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.ఎల్లయ్య, బి.వాసుదేవరావు, హెచ్.ఈశ్వర్రావు, దుర్గాప్రసాద్, కె.గణేష్, బి.ప్రభాకర్, టి.అప్పన్న, వి.ధనుంజయ్, ఎ.షణ్ముఖరావు పాల్గొన్నారు.



ఎక్కడి శ్రీముఖలింగం.. ఎక్కడి ఇండోనేషియా. ఈ రెండు ప్రాంతాల మధ్య సంబంధం ఏంటి..? అక్కడి బాలి ద్వీపం పేరుతో ఇక్కడ యాత్ర నిర్వహించడం ఏమిటి..? నేడు చిన్న పల్లెలా కనిపిస్తున్న శ్రీముఖలింగం అసలు వైభవమేమిటి..? ఒడిశా కళింగ రాజుల కథల్లో మన వంశధార ప్రస్థానమేమిటి..? అన్ని ప్రశ్నలకు ఒకటే సమాధానం బాలి యాత్ర. ఒకప్పుడు ఏటా కార్తీక పౌర్ణమి నాడు ఇక్కడ నిర్వహించిన ఈ పురాతన యాత్రకు ఇప్పుడు మళ్లీ శ్రీకారం చుట్టారు. ఆ ప్రశ్నలన్నింటికీ ఈ యాత్ర కథలే సమాధానం. రండి గతంలోకి వెళ్దాం..

బాలి యాత్ర.. తెలుసుకుందాం రా

- శ్రీముఖలింగం వేదికగా బాలి యాత్ర
- పురాతన జాతరకు పునర్జన్మ
- 17న క్రతువు నిర్వహించేందుకు నిర్వాహక కమిటీ నిర్ణయం

జలుమూరు:

రాజుల కాలంలో ఒక వెలుగు వెలిగిన శ్రీముఖలింగం తన గత వైభవపు ఆనవాళ్లను మళ్లీ జ్ఞప్తికి తెచ్చుకుంటోంది. వేల ఏళ్ల కిందట కళింగ రాజుల కాలంలో ఇక్కడ వంశధార మీదుగా సాగిన వ్యాపార లావాదేవీలు, కళింగపట్నం ఓడరేవు, ఒడిశాలోని చిలికా ఓడరేవు నుంచి నిర్మితమైన వ్యాపార సామ్రాజ్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటోంది. వేల ఏళ్ల కిందట నిర్వహించిన బాలియాత్రను మళ్లీ నిర్వహించడానికి స్థానికులు సంకల్పించడంతో ఆ కథలన్నీ ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి.

బాలి యాత్ర అంటే ఏమిటి..?

ప్రపంచానికి సముద్ర యానం అంటే తెలియని రోజుల్లో కళింగ సీమలో వ్యాపారులు నౌకలు, పడవలపై సరుకులతో తూర్పు ఆగ్నేయ దేశాలైన ఇండోనేషియా, మలేషియా, జావా, సుమిత్రా, సింగపూర్, శ్రీలంక, చైనా తదితర దేశాలకు వెళ్లి బాలి ద్వీపానికి చేరేవారు. మన దేశంలో ఒడిశాలోని చిలకా సరస్సు, పారాదీప్ రేవు ఈ ప్రయాణానికి ఒక ముఖ్యమైన ప్రారంభం స్థానంగా ఉండేది. వ్యాపారానికి వెళ్లిన వారు క్షేమంగా మంచి లాభాలతో సురక్షితంగా రావాలని ఆకాంక్షిస్తూ మన ఆడపడుచులు, కార్తీక పౌర్ణమి తదుపరి మూడు రోజులు శ్రీముఖలింగంలో వంశధార నదీ తీరాన అరటి దొప్పలపై దీపాలు వదిలేవారు. ఈ యాత్ర విశేషాలకు సాక్షిగా తామ్ర లిపి, పాలూరి లిపిలు ఉన్నాయి. అలాగే ప్రాచీనాంధ్ర నౌకా జీవనం అనే పుస్తకంలో బావరాజు వెంకట కృష్ణారావు స్పష్టంగా ఈ బాలియాత్ర కళింగ దేశంలో ఎలా నిర్వహించేవారో వివరించారు.



శ్రీముఖలింగంలోనే ఎందుకు..?

ఒడిశాలోని మహానది మొదలు ఇటు గోదావరి నది వరకూ ఉన్న ప్రాంతాన్ని కళింగ దేశం, కళింగసీమ అన్న పేర్లతో పిలుస్తారు. ఈ ప్రాంతంలో మన శ్రీముఖలింగం ప్రముఖ ప్రాంతంగా, తొలుత గంగ రాజుల రాజధానిగా కూడా ఉండేది. తర్వాత కటక్ రాజధానిగా మారిందని చరిత్ర కారులు చెబుతారు. వందల ఏళ్ల పాటు ఇక్కడ సాగిన బాలి జాతర ఈస్టిండియా కంపెనీ వల్ల ఆగిపోయిందని చెబుతారు.

కార్యక్రమం ఇలా..


ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీముఖలింగం ప్రధాన దేవాలయం వద్ద స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు, అర్చకులు వేద మంత్రాచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు మంగళ హారతులతో నది వరకూ ఊరేగింపుగా వెళ్లి అక్కడ స్నానాలుచేసి ఉత్సవం నిర్వహిస్తారు.

సంపద తీసుకువచ్చే యాత్ర




బాలి యాత్ర అంటే మన కళింగ దేశంలో ఉన్న ప్రజలకు సిరులు, సంపదలు తీసుకు వచ్చే జాతర. ఇటు ఒడిశా మహానది నుంచి అటు గోదావరి నది వరకు ఉన్న ప్రాంతాన్ని కళింగ సీమ అంటారు. నాడు అంతర్జాతీయ స్థాయిలో నౌకా వ్యాపారం జరిగేది. మన ప్రాంతం ఆర్థికంగా ఎంతో బాగుండేది. ఈ ప్రాంతాన్ని సువర్ణ భూమిగా పిలిచేవారు. ఆంగ్లేయులు వచ్చి నాటి సంప్రదాయాలను తెరమరుగు చేసేశారు. - కొల్లూరి సూర్యనారాయణ, రిటైర్డ్ ప్రొఫెసర్, ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్నం

సంప్రదాయాలు తెలిపేందుకే..



కనుమరుగైన మన సంప్రదాయాలు భావితరాలకు తెలిపేందుకే ఈ బాలి యాత్ర నిర్వహిస్తున్నాం. కులాలు, రాజకీయాలకు అతీతంగా కళింగ సీమ ప్రజలు బాగుండాలని అందరి సహకారంతో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతున్నాం. - డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, నిర్వాహక కమిటీ ప్రతినిధి

కళింగ రాజుల పేరుతో ఘాట్‌లు..



బాలియాత్ర నిర్వహించే నది ఘాట్

మహామేఘ వహన ఘాట్, ఖారవేల ఘాట్, చటరాజ్ ఘాట్, పద్మనాభ ఘాట్.. ఇవన్నీ మన వంశధారలోనివే అంటే నమ్ముతారా. ఈ పేర్లన్నీ ఘన చరిత్ర కలిగిన ఒడిశా కళింగ రాజులవి. వారి పేర్లతో ప్రత్యేకంగా ఇక్కడ ఘాట్లు నిర్మించి బాలి యాత్ర నిర్వహించేవారు. మన పూర్వీకులంతా ఈ జాతర జరుపుకున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. హిందూ మహాసముద్రం చిత్రం తెలియజేసే సంజీవ్ సన్యాల్ పుస్తకం 'ఓషన్ ఆఫ్ చర్న్'లోనూ ఈ జాతర ప్రస్తావన ఉంది.

ఏడుగురు ఎస్‌ఐలకు స్థానచలనం



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఏడుగురు ఎస్‌ఐలకు స్థానచలనం చేస్తూ డీఐజీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయి. వీరిలో విజయనగరం జిల్లా నుంచి వాసంశెట్టి లోవరాజు (ట్రాఫిక్), శ్రీరాము హరిబాబునాయుడు(వన్‌టౌన్ పీఎస్)లను జిల్లాలోని సోంపేట, బారువలకు కేటాయించగా జిల్లానుంచి విజయనగరం వీఆర్‌కు వెళ్లినవారిలో లోకవరపు చంద్రశేఖర్ (బారువ), గేదెల వాసుదేవరావు (శ్రీకాకుళం వీఆర్)ఉన్నారు. బడ్డా హైమావతి సోంపేట నుంచి శ్రీకాకుళం వీఆర్, కొట్యాడ రాము కవిటి నుంచి టెక్కలి ఎస్‌ఐ-1, చామంతుల రామారావు శ్రీకాకుళం వీఆర్ నుంచి డీపీటీసీ అటాచ్డ్ శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్, తూర్పాటి రాజేష్ డీపీటీసీ అటాచ్డ్ శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ నుంచి కాశీబుగ్గ ఎస్‌ఐ-1, జి.రాజేష్ కంచిలి నుంచి శ్రీకాకుళం వీఆర్‌కు బదిలీ అయ్యారు.

క్లుప్తంగా

ఐఈఐ కేంద్ర సభ్యునిగా రాజశేఖరరావు



రాజశేఖర్‌రావును అభినందిస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఐఈఐ) సభ్యులుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు ఎంపికయ్యారు. వైస్ చాన్సలర్ కేఆర్ రజిని ఆయనను శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ పరిధిలో ఆన్‌లైన్‌లో ఎంపిక నిర్వహించగా, రాజశేఖర్‌కు ఎక్కువ మంది మద్దతు లభించటంతో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికం విభాగంలోఎంపికయ్యారు.1920 ఐఈఐ ప్రారంభమైంది, కోల్‌కతా ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది.

ఏపీ బ్యాడ్మింటన్ టీమ్ మేనేజర్‌గా గురుగుబెల్లి



గురుగుబెల్లి రాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ జట్టుకు మేనేజర్‌గా సబ్ రిజిస్ట్రార్ డాక్టర్ గురుగుబెల్లి రాజు నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఏపీబీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మ చౌదరి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఒడిశా వేదికగా ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న ఆలిండియా జూనియర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో ఆంధ్రా జట్టుకు మేనేజర్‌గా డాక్టర్ రాజు వ్యవహరించనున్నారు.

బెల్టుషాపులు నిర్వహించకూడదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో బెల్టుషాపులు నిర్వహించరాదని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి సీహెచ్ తిరుపతి నాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 7 నుంచి ఇప్పటివరకు 67 బెల్టుషాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేశామని, 177.6 లీటర్ల మద్యం, 34.96 లీటర్ల 34.06 బీరు బాటిళ్లు సీజ్ చేశామన్నారు.

చలికాలం.. జరభద్రం





వృద్ధులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి

- ప్రారంభమైన శీతల గాలులు
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

హిరమండలం: జిల్లాలో చలి గాలులు ప్రారంభమయ్యాయి. ఉదయం ఏడు గంటల వరకు పొగమంచు, చల్లదనం ఉంటోంది. సాయంత్రం ఆరు గంటల నుంచి చల్లని గాలులు వీస్తున్నాయి. ఈ శీతల గాలుల్లో వ్యాధులు పొంచి ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గిరిజన ప్రాంత వాసులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ప్రాథమిక దశలో..

జలుబు, దగ్గు, చలి జ్వరం, గొంతు నొప్పి వంటి రుగ్మతలు అధికం కాకముందే ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించాలి. వారి సూచనల మేరకు మందులు వాడుకోవాలి. చిన్నారులు, గుండె, డయాబెటిక్ బాధితులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ సీజన్‌లో వ్యాధులు ఎక్కువగా ఆశిస్తాయి. న్యూమోనియా, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు గురై ప్రాణాపాయ స్థితికి చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో వచ్చే ఏ చిన్న సమస్యనైనా అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యనిపుణులను సంప్రదించడం ఉత్తమం. ఈ కాలంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో ఇన్‌ఫెక్షన్స్, స్వైన్ ఫ్లూ వంటి ప్రాణాపాయ వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు శరీరానికి వేడినిచ్చే ఆహారా పదార్థాలను తినాలి. గుమ్మడి, బప్పాయి, ఆరెంజ్, పసుపు రంగుతో కూడిన ఆహారాలు వాడటం శ్రేయస్కరం.

జాగ్రత్తలు ఇలా..

- చర్మం పొడిబారిపోకుండా ఔషధ పూరిత లేపనాలు వాడుకోవాలి.
- రసాయనాలతో కూడిన సబ్బుల బదులు మైల్డ్ సోప్స్ వాడటం మంచిది.
- గోరువెచ్చని నీటితో స్నానం చేయడం ఆరోగ్యకరం.
- చలి గాలుల కారణంగా చర్మ సంబంధిత, అస్తమా, గుండె జబ్బులు, చెవి, ముక్కు, గొంతు నొప్పులు వచ్చే ప్రమాదం ఉంది.

జాగ్రత్తలు పాటించాలి



చలికాలంలో పిల్లలు, పెద్దలు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు అధికం. ప్రధానంగా ఆస్తమా ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలి. రోజులో కనీసం 20 నిమిషాల పాటు ఉదయం, సాయంత్రం శరీరంపై సూర్యకాంతి పడేలా చూసుకోవాలి. తప్పనిసరిగా తృణధాన్యాలు తీసుకోవాలి. పిల్లలకు కోడిగుడ్లు, విటమిన్–డి అధికంగా ఉంగే పదార్థాలను ఇవ్వాలి.

– సీహెచ్ సాయిగీత, వైద్యాధికారి, పీహెచ్‌సీ, హిరమండలం

- ముఖ్యంగా చిన్న పిల్లల్లో చెవిపోటు, గొంతు నొప్పి, జలుబు వచ్చే అవకాశం ఉన్నందున సూర్యరశ్మి వచ్చాకే బయటకు పంపించాలి.
- రోజూ మూడు నుంచి తొమ్మిది గ్లాసుల నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి.
- పొగ తాగేవారు చలిలో వాకింగ్ చేస్తే రక్తనాళాలు సంకోచిస్తాయి. బీపీ, సుగర్ ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవాలి.
- ఆస్తమా, శ్వాసకు సంబంధించిన సమస్యలున్నవారు మంచులో నడిచే సమయంలో జాగ్రత్తలు పాటించాలి
- చక్కెర వ్యాధిగ్రస్తులు వ్యాయామం చేసే సమయంలో తీపి పదార్థాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఇన్‌హేలర్ వాడేందుకు బదులు ఉదయం, సాయంత్రం వేళల్లో నీటి ఆవిరి పట్టడం మంచిది.

ఆంధ్రా టీ–20 జట్టుకు శ్రీనివాస్ ఎంపిక



ఎస్‌హెచ్ శ్రీనివాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక సయ్యద్ ముస్తాక్ ఆలీ ట్రోఫీ టీ–20 క్రికెట్ టోర్నీకి జిల్లాకు చెందిన సీనియర్ ఆటగాడు ఎస్‌హెచ్ శ్రీనివాస్ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రకటించిన ఆంధ్రా టీ–20 క్రికెట్ తుది జట్టులో ఆల్‌రౌండర్ కోటాలో శ్రీనివాస్‌కు చోటు లభించింది. ఈ పోటీలు హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా జరగనున్నాయి. గతంలో అండర్–17 జూనియర్ ఇండియాతోపాటు అన్ని వయోవిభాగాల్లో ఆంధ్రా జట్టుకు ఎంపికై గుర్తింపు పొందాడు. శ్రీకాకుళం నగరంలో సొంతంగా క్రికెట్ అకాడమీని నెలకొల్పి శిక్షణను అందిస్తున్నాడు.

సీజ్ చేసిన ఇసుక మాయం

సరుబుజ్జిలి:

ఇటీవల అధికారులు సీజ్ చేసిన ఇసుకను కొంతమంది రాత్రి వేళల్లో బయటకు తరలిస్తున్నారు. పెద్దపాలెం సమీపంలోని దంతవరపుకోటలో 'ఆగని ఇసుక దందా' పేరుతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ఒక లారీతో పాటు పలుచోట్ల ఉన్న ఇసుకపోగులను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను వీఆర్వోలు, వీఆర్‌ఏల పర్యవేక్షణలో ఉంచారు. వాటి తాజా ఫొటోలు ఎప్పటికప్పుడు కార్యాలయానికి పంపాలని ఆదేశాలిచ్చారు. అయితే వారు ఆ వైపు పెద్దగా దృష్టిసారించలేదు. ఇదే అదనుగా భావించిన కొంతమంది ఇసుక వ్యాపారులు సీజ్ చేసిన ఇసుకను రాత్రి వేళల్లో లోడింగ్ చేసి లారీలకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది.



మాయమైన ఇసుక పోగులు

బావిలో పడి వ్యక్తి మృతి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పాత జాతీయ రహదారి ఆనుకుని ఉన్న రెల్లి వీధిలో శుక్రవారం సాయంత్రం ఓ వ్యక్తి బావిలో పడి మరణించాడు. స్వీట్ షాప్ కు చెందిన బ్యాకరీలో పనిచేస్తున్న వీరస్వామి (52) వ్యక్తి మద్యం మత్తులో బేకరీ వెనుక భాగంలో ఉన్న నేలబావిలో జారి పడిపోయి మరణించాడు. దీనిపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



మాట్లాడుతున్న డీసీసీబీ సీఈఓ డి.వరప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని అరసవల్లి డీసీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సహకార వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీబీ సీఈఓ డి.వరప్రసాద్ పాల్గొని సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార రంగంలోని సహకార సంస్థలు ఏవిధంగా పాత్ర పోషిస్తున్నాయో తెలిపారు. శ్రీకాకుళం డివిజనల్ సహకార అధికారి బి.మురళీకృష్ణ మాట్లాడుతూ సహకార సంస్థలలో సాంకేతిక ఆవిష్కరణలు, సుపరిపాలన గురించి వివరించారు. టెక్కలి డివిజన్ కో–ఆపరేటివ్ కె.మురళీకృష్ణ మాట్లాడుతూ డీసీఎంఎస్ నందు ఎన్నో సవాళ్లు, సమస్యలు ఉన్నాయని, వాటిని అధిగమిస్తూ సంస్థ ఆస్తులను కాపాడుకుంటూ గట్టి చర్యలు తీసుకుని ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా నూతన వ్యాపారాభివృద్ధి ప్రణాళికలు అమలు చేసి ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సహకార విద్యాధికారి ఎం.రమేష్‌బాబు, శ్రీకాకుళం సబ్ డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి చంటిబాబు, అధికారులు కె.దామోదరరావు, ఎర్రన్నాయుడు, ఎస్.భూషణరావు, కె.జానకిరాం, ఎం.శ్రీనివాసరావు, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమితో బీసీలకు ఒరిగిందేమీ లేదు



దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల వర్గాలకు రాజకీయ, నామినేటెడ్ పదవులు కేటాయించారని పార్టీ కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు అన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు శ్రీకాకుళం జిల్లాలో బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీల పక్షపాతిగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజల్ని మోసగించిందని విమర్శించారు. చంద్రబాబుకి తన సామాజిక వర్గ అభివృద్ధి యావ తప్ప మిగిలిన సామాజిక వర్గాలను పట్టించుకోవాలనే ఆలోచన లేదన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియాపై అక్రమ కేసులు పెట్టి తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నారని, అక్రమ కేసులు బనాయించి భయపెట్టాలని చూస్తే ఊరుకునేవారెవ్వరు లేరన్నారు.

మద్యం మత్తులో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



లబ్బ శ్రీనివాసరావు(ఫైల్)

నరసన్నపేట: పోలాకి మండలం జిల్లోడు వలసకు చెందిన లబ్బ శ్రీనివాసరావు (32) మద్యం మత్తులో ప్రాణాలు కోల్పోయాడు. మృత దేహాన్ని ఇందిరానగర్ ప్రారంభంలో ఉన్న జనపనార శిక్షణ కేంద్ర భవనంపైన పోలీసులు గుర్తించారు. శ్రీనివాసరావు రెండు రోజులుగా ఇంటికి వెళ్లకపోవడంతో తల్లి జయమ్మ చుట్టుపక్కలంతా గాలించారు. ఎక్కడా ఆచూకీ తెలియరాలేదు. పోలీసులకు ఫిర్యాదుచేసేందుకు సిద్ధమవుతుండగా గురువారం రాత్రి జనపనార శిక్షణ కేంద్ర భవనం మేడపైన విగతజీవిగా కనిపించాడు. మద్యం అధికమై నీరు అందగా మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృత దేహానికి చీమలు పట్టడంతో రెండు రోజుల కిందటే మరణించి ఉండవచ్చని తెలుస్తోంది. తల్లి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు శుక్రవారం అప్పగించారు. మృతునికి వివాహం కాలేదు. తండ్రి గతంలోనే మరణించాడు. భర్త, కుమారుడు ఇద్దరూ దూరం కావడంతో జయమ్మ కన్నీరు మున్నీరు అవుతుంది.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న దృశ్యం



ఖోఖో ఆడుతున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో జోన్–1 ప్రాంతీయ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల బాలికల స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ పోటీల్లో శుక్రవారం ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని 21 గురుకులాలు నుంచి 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెండో రోజు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో లీగ్ దశ వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, క్యారమ్స్, త్రోబాల్, అథ్లెట్ పోటీలు జరిగాయి. గురుకులాల జిల్లా సమన్వయకర్త బాలాజీ నాయర్, ఎచ్చెర్ల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ ఆటల పోటీలు పర్యవేక్షిస్తున్నారు.

జాతీయ సేవా శిబిరానికి వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం మనాలిలోని అటల్ బిహారీ వాజపేయ్ మౌంటెనీరింగ్ అండ్ ఏలైడ్ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో 20వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జాతీయ స్థాయి ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం జరగనుంది. ఈ శిబిరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం తరఫున పది మంది విద్యార్థులు హాజరవుతున్నారు. విశ్వవిద్యాలయం నుంచి ఎనిమిది మంది, పలాస సూర్యతేజ డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు శిబిరంలో పాల్గొంటారు. ఈ విద్యార్థులను వర్సిటీలో శుక్రవారం వీసీ కె.ఆర్.రజిని, అధికారులు అభినందించారు.



దామోదరపురం గ్రామంలో పొలాల గట్లను దాటుకుంటూ మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలిస్తున్న గ్రామస్తులు

ఆఖరి మజిలీకి అవస్థలు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస పంచాయతీ దామోదరపురం గ్రామంలో దళితులు శ్మశానవాటికకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందడంతో అంత్యక్రియల కోసం పొలాలను దాటుకుంటూ శ్మశానవాటికకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా దళితుల శ్మశాన వాటికకు సరైన రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

17న జిల్లా స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపికలను ఈనెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్టు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ఎస్‌వీ ప్రసాద్, ఝాన్సీ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్ వేదికగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను వచ్చేనెల 7 నుంచి 9వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.కాంతారావు (9493509090) ను సంప్రదించాలన్నారు.

గిరిజన ఉత్పత్తులు దేశమంతా విక్రయిద్దాం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- ఘనంగా బిర్సాముండా జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మెళియాపుట్టి: గిరిజనులకు వారి సంప్రదాయాలు చాలా ముఖ్యమని, వాటిని పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాలలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా 150వ జయంతి నిర్వహించారు. 'జన్ జాతీయ గౌరవ్ దివస్'గా నిర్వహించిన వేడుకల్లో సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. బిర్సాముండా సాహసాలను గుర్తు చేసుకోవడం అత్యవసరని కలెక్టర్ అన్నారు. ప్రకృతి సిద్ధంగా పంటలు పండించే గిరిజనుల ఉత్పత్తులు దేశవ్యాప్తంగా విక్రయించేలా చూడాలన్నారు. మొబైల్ యాప్ ఏర్పాటు చేసి, సీతంపేట ఐటీడీఏ ద్వారా 'ఆమోదం' అనే బ్రాండ్ ద్వారా,లేదా సొంత బ్రాండ్ ద్వారా విక్రయించవచ్చని తెలిపారు. గిరిజన సంప్రదాయ వేషధారణలతో ఉన్న విద్యార్థులతో ముచ్చటించారు. గిరిజనులు వాడిన పురాతన వస్తువులను తిలకించి వాటి గురించి తెలుసుకున్నారు. వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ బీహార్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని తిలకించారు. 130 మందికి ఆర్వో ఎఫ్ఆర్ పట్టాలు, భూసార పరీక్షల కార్డులు, సికిల్ సెల్ ఎనీమియా (రక్తహీనత వ్యాధి) వ్యాధిగ్రస్తులకు హెల్త్ కార్డులు అందించినట్లు తెలిపారు. సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి గురించి వివరించారు. కార్యక్రమంలో సీతంపేట బందపల్లి, పెద్దమడి పలు గిరిజన సంక్షేమ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, స్థానిక సర్పంచ్ రేభాన లక్ష్మమ్మ పలు శాఖలకు చెందిన అధికారులు, గిరిజన ప్రజలు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు